

ఆశ వర్కర్లు ఆందోళన



రావికమతంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న ఆశ వర్కర్లు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్ వర్క్)

తమ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించేందుకు విజయవాడ వెళుతున్న ఆశ వర్కర్లను పోలీసులు గృహనిర్బంధం, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆశ కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీలు, రాస్తారోకోలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, జిల్లా నుంచి విజయవాడకు బస్సుల్లో వెళుతున్న ఆశ కార్యకర్తలను అర్ధరాత్రి మార్గమధ్యంలో దించేసి, రాత్రంతా పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం దారుణమని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, సచివాలయాల డ్యూటీలను రద్దుచేయాలని, ఏఎన్ఎం/ హెల్త్ వర్కర్స్ నియామకాల్లో ఆశ వర్కర్లకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, పదవీ విరమణ తరువాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

అప్పన్న జల విహారం

- వైభవంగా స్వామివారి తెప్పోత్సవం

సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఏటా పుష్యమాస బహుళపక్ష అమావాస్య నాడు స్వామివారు కొండదిగువన పుష్కరిణిలో ఉభయ దేవేరులతో నౌకా విహారం చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని హంసాకృతిలో తీర్చిదిద్దిన నౌకలో ముమ్మారు మండపం చుట్టూ తిప్పారు. - వివరాలు 5వ పేజీలో



నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

- నాతవరం మండలం ములగపూడిలో రచ్చబండ కార్యక్రమం



నాతవరం, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా నాతవరం మండలం ములగపూడి గ్రామంలో ఉదయం పది గంటలకు నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు. సుమారు గంటన్నరపాటు ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల సన్యాసిరావు చెప్పారు. ఈ కార్య క్రమం అనంతరం షర్మిల అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని ఆయన తెలిపారు. షర్మిల నిర్వహించే రచ్చబండ కార్యక్రమం కోసం ములగపూడిలో రెండు రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

కలగానే కేఎం ఛానెల్‌కు నీరు

- ఐదేళ్లయినా హామీని అమలు చేయని ప్రభుత్వ విప్
- ఎమ్మెల్యేగా గెలిచిన నెల రోజుల్లోనే తూము ఏర్పాటు చేయిస్తానని గత ఎన్నికల ముందు రైతులకు హామీ
- ఇంతవరకు కార్యరూపం దాల్చని వైనం
- వెయ్యి ఎకరాలకు నీరు అందక రైతులు అవస్థలు

రావికమతం, ఫిబ్రవరి 9:

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నెల రోజుల్లోనే పెద్దేరు కాలువకు తూము ఏర్పాటు చేయించి కేఎం ఛానెల్ ఆయకట్టుకు సాగు నీరు అందిస్తానని గత ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కరణం ధర్మశ్రీ.. నాలుగురేళ్లయినా అమలు చేయలేదు. 'మాట తప్పం.. మడమ తిప్పం' అంటే ఇదేనేమోనని రైతులు ఎద్దేవా చేశారు. అంతేకాక ఈ నెల 2వ తేదీన కొమిర గ్రామానికి వచ్చిన ఆయనను నిలదీశారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఐదేళ్లు కావస్తున్నది, మరికొద్ది వారాల్లో ఎన్నికలు జరగనున్నాయి, కేఎం ఛానెల్ ఆయకట్టుకు ఇంకెప్పుడు నీరు ఇస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొమిర వద్ద పూడుకుపోయిన కేఎం ఛానెల్

రావికమతం మండలంలో కేఎం (కొమిర, మత్స్యపురం) ఛానెల్ కింద కొమిర, మత్స్యపురంతోపాటు చినపాచిల గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు వుంది. పెద్దేరు జలాశయం నిర్మించకముందే ఎగువనున్న కొండప్రాంతం నుంచి వచ్చే వర్షపునీటి ఆధారంగా కేఎం ఛానెల్ ద్వారా పొలాలకు నీరు అందేది. మాడుగుల మండలం రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయం నిర్మాణ సమయంలో.. కుడి(రాచకట్టు) కాలువ నుంచి కేఎం ఛానెల్‌కు సాగునీరు అందించాలని ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు చేశారు. అయితే ఈ కాలువ ద్వారా నేరుగా తమ పొలాలకు నీరు అందదని, అందువల్ల బుడ్డిబంద-చినపాచిల మధ్య కరెడ్ల వారి కల్లాల సమీపంలో 42వ డిస్ట్రిబ్యూటరీ వద్ద తూము ఏర్పాటు చేయాలని కోరారు. కానీ రైతుల వినతిని అధికారులు పెడచెవిన పెట్టారు. 42వ డిస్ట్రిబ్యూటరీ వద్ద తూము ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. తూము నిర్మించకుండా కాలువ తవ్వకం పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు. దీంతో దిగివచ్చిన అధికారులు.. 42వ డిస్ట్రిబ్యూటరీ వద్ద తూము ఏర్పాటు చేస్తామని, ఎగువనున్న మీ భూములకు సాగు నీరు ఇచ్చిన తరువాత దిగువ భూములకు నీరు ఇస్తామని చెప్పారు. దీంతో రైతులు శాంతించారు. కానీ ఇరిగేషన్ అధికారులు తమ మాట నిలుపుకోలేదు.. 42వ డిస్ట్రిబ్యూటరీ వద్ద తూము ఏర్పాటు చేయలేదు. పెద్దేరు రిజర్వాయర్ నిర్మాణం పూర్తయ్యింది. కుడి, ఎడమ కాలువల నుంచి నీటిని విడుదల చేశారు. కానీ కేఎం ఛానెల్ ఆయకట్టు భూములకు మాత్రం నీరు చేరలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. అధికారులు తూము ఏర్పాటు చేయకుండా, రూ.3 లక్షలతో తూతూమంత్రంగా పాత కాలువకు మర్మమతులు చేసి చేతులు దులుపుకున్నారు. కేఎం ఛానెల్‌కు నీటి సదుపాయం కల్పించాలని రైతులు.. చోడవరం నుంచి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యేలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో సుమారు ఐదేళ్ల క్రితం ... మిగతా 6వ పేజీలో

టీడీపీ సర్పంచ్‌పై కక్ష సాధింపు

- వెదురువాడ పంచాయతీ కార్యాలయంలో సచివాలయం ఎత్తివేత
- ఊరికి దూరంగా ఉన్న ఆర్‌బీకేలోకి తరలింపు
- మాటమాత్రంగా అయినా సర్పంచ్‌కు చెప్పని అధికారులు
- సచివాలయం కోసం పంచాయతీ భవనంపై రూ.40 లక్షలతో అదనపు అంతస్థు నిర్మాణం
- స్థానిక వైసీపీ నేతల ఒత్తిళ్లతో ప్రారంభించని ఎమ్మెల్యే
- సర్పంచ్ శ్రీనివాసరావు ఆవేదన



సచివాలయం కోసం రూ.40 లక్షలతో పంచాయతీ భవనంపై నిర్మించిన అదనపు అంతస్థు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 9:

తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు సర్పంచులుగా వున్న పంచాయతీల్లో అధికార పార్టీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడం, ఒకవేళ అభివృద్ధి పనులు చేసినప్పటికీ వాటిని వినియోగంలోకి తేకుండా నిరుపయోగంగా వుంచడం చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడడమే కాకుండా లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథా అవుతున్నది. తాజాగా ఈ తరహా సంఘటన మండలంలోని వెదురువాడలో చోటు చేసుకుంది. సచివాలయం కోసం సుమారు రూ.40 లక్షలతో పంచాయతీ కార్యాలయం భవనంపై నిర్మించిన అదనపు అంతస్థును వినియోగంలోకి తీసుకురాకుండా, సచివాలయం సిబ్బందిని వేరేచోట నిర్మించిన ఆర్‌బీకే భవనంలోకి తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

మూడేళ్ల క్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని వెదురువాడ పంచాయతీ సర్పంచ్‌గా తెలుగుదేశం పార్టీ మద్దతుదారుడైన కొయ్యా శ్రీనివాసరావు సర్పంచ్‌గా గెలుపొందారు. దీంతో వైసీపీకి చెందిన మండల నాయకులతోపాటు నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేత కూడా గుర్రుగా వుంటున్నారు. అభివృద్ధి పనుల విషయంలో సర్పంచ్‌కు ఏమాత్రం సహకరించడంలేదు. పైగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇదిలా వుండగా వెదురువాడ సచివాలయాన్ని ఆరంభం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. వసతి కొరతతో ఉద్యోగులు ఇబ్బంది పడుతుండడంతో పంచాయతీ భవనంపై అదనపు అంతస్థు నిర్మాణానికి మూడేళ్ల క్రితం అధికారులు నిధులు మంజూరు చేశారు. రెండు నెలల క్రితం పనులు కూడా పూర్తయ్యాయి. భవనాన్ని ప్రారంభించి సచివాలయాన్ని పై అంతస్థులోకి మార్చాల్సి వుంది. కానీ పంచాయతీ సర్పంచ్ టీడీపీ మద్దతుదారుడు కావడంతో గ్రామ సచివాలయాన్ని పంచాయతీ భవనంలో ... మిగతా 6వ పేజీలో



సచివాలయాన్ని తరలించిన రైతు భరోసా కేంద్రం

వైసీపీ నేత భూ దందా

వంగలిలో జగనన్న కాలనీకి రెండు ఎకరాలు గుర్తించిన అధికారులు

- ఈ భూమి తన సాగులో ఉన్నట్టు బంగారమ్మపాలేనికి చెందిన అధికార పార్టీ నేత బురిడీ
- లేఅవుట్‌లో రోడ్డును ఆనుకుని 900 గజాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు
- మార్కెట్ విలువ రూ.40 లక్షలు



వైసీపీ నేత అక్రమంగా పొందిన స్థలంలో ఇళ్ల నిర్మాణం

సబ్బవరం, ఫిబ్రవరి 9:

మండలంలోని వంగలి గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌కు ఎంపిక చేసిన ప్రభుత్వ భూమి తన సాగులో వుందంటూ బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత ఒకరు రెవెన్యూ అధికారులను బురిడీ కొట్టించాడు. ఇందుకు ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన 900 గజాల స్థలాన్ని పొందాడు. మార్కెట్ రేటు ప్రకారం ఈ స్థలం విలువ రూ.40 లక్షలు వుంటుంది. వివరాల్లోకి వెళితే..

జగన్న ఇళ్ల నిర్మాణం కోసం వంగలి గ్రామంలో సర్వే నంబరు 214-1ఎ-7లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీనిని పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లగా.. ఈ భూమి తన సాగు వుందంటూ బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత ఒకరు చెప్పారు. తనకు పరిహారంగా ఎకరాకు 900 గజాల స్థలం ఇవ్వాలని, లేకుంటే భూమిని ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. వైసీపీ నాయకుడు కావడంతో అధికారులు సరే అన్నారు. అనంతరం ప్రధాన రహదారికి ఆనుకొని 900 గజాలు స్థలాన్ని అతనికి వదిలేసి, మిగిలిన భూమిలో 66 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అయితే వాస్తవంగా ఈ భూమి వంగలికి చెందిన దళితుల సాగులో వుంది. ఈ విషయం అప్పటి రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ సదరు వైసీపీ నేతతో కుమ్మక్కు అయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఆ భూమిలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా ... మిగతా 6వ పేజీలో

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం

టీడీపీ-జనసేన గెలుపునకు ఐక్యంగా పనిచేయాలి

- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు పిలుపు
- వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రం అంధకారం
- మహిళలు, ఆడపిల్లలకు రక్షణ లేదు
- రోడ్లు దారుణంగా ఉంటే డిప్యూటీ సీఎం ఏం చేస్తున్నారని నిలదీత
- మాడుగుల, చోడవరంలో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు



మాడుగుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 9:

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మాడుగుల మండలం డి.సురవరం సమీపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టి, ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసి, వాళ్లు మాత్రం ప్రజా సంపదను దోచుకుంటున్నారని వైసీపీ నేతలను ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, ఆడపిల్లలకు భద్రత కరువైందని, వీరికి రక్షణ కల్పించాల్సిన పోలీసులను వైసీపీ పాలకులు తమ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆయన ... మిగతా 6వ పేజీలో

నేడు నాగబాబు అనకాపల్లి రాక

కొత్తూరు, ఫిబ్రవరి 9:

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు శనివారం అనకాపల్లి రానున్నారని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే జనసైనికుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొంటారని, నియోజకవర్గంలో పార్టీ కమిటీల ప్రతినిధులు, నాయకులు, గ్రామ అధ్యక్షులు హాజరు కావాలని ఆయన కోరారు.



చోడవరం సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

కొరుప్రోలులో చోరీ

- 8 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు అపహరణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 9: మండలంలోని కొరుప్రోలు గ్రామంలో తాళం వేసి వున్న ఓ ఇంటిలో దొంగలు పడ్డారు. సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, ఇరవై తులాల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి... కొరుప్రోలు గ్రామానికి చెందిన పినపాత్రుని నాగలక్ష్మి, విశాఖలో వుంటున్న తన చిన్నాన్న ఆరోగ్యం బాగోకపోవడంతో ఈ నెల 6వ తేదీన ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లింది. నాలుగు రోజుల తరువాత ఆమె శుక్రవారం సాయంత్రం తిరిగి కొరుప్రోలు వచ్చింది. ఇంటి తాళాలు పగలగొట్టి వుండడంతో ఆందోళన చెందిన ఆమె లోపలికి వెళ్లి చూడగా బీరు తెరిచి వుంది. ఇందులో వుంచిన నక్లెస్, నల్లపూసలు, రెండు గొలుసులు కలిసి సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు కనిపించ లేదు. దీంతో చోరీ జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి.అప్పన్న, ఎస్ఐ విభీషణరావు కొరుప్రోలులో నాగలక్ష్మి ఇంటికి వెళ్లి ని పరిశీలించారు. క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిలో బీరువాను పరిశీలిస్తున్న సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు

నేడు విశాఖకు లోకేశ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం సాయంత్రం విశాఖ రానున్నారు. ఉత్తరాంధ్రలో పది రోజులపాటు నిర్వహించనున్న 'శంఖారావం' కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం విమానంలో విశాఖ రానున్న లోకేశ్...ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఇచ్ఛాపురం వెళ్లి రాత్రికి అక్కడే బస చేస్తారు.

క్రైం... crime news

భూ వివాదంలో కొట్లాట

» ముగ్గురిపై కేసు

గొలుగొండ, ఫిబ్రవరి 9: భూ వివాదానికి సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పాతమల్లంపేట గ్రామ పంచాయతీ శివారు అచ్చియ్యపేట గ్రామానికి చెందిన కెల్లా రాజులు, తన కుటుంబ సభ్యులకు మధ్య భూ సరిహద్దుల విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదంలో కెల్లా జగ్గన్న, కెల్లా పార్వతి, నాగరాజులు కలిసి రాజులు తలపై కర్రలతో కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హైవేపై స్పిరిట్ ట్యాంకర్ లారీ బోల్తా


హైవేపై బోల్తాపడిన స్పిరిట్ ట్యాంకర్ లారీ

నక్కపల్లి, ఫిబ్రవరి 9: మండలంలో ఒడ్డిమెట్ట హైవే జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం స్పిరిట్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ లారీ బోల్తాపడింది. దీనికి సంబంధించి వివరాలిలా వున్నాయి.. తుని నుంచి విశాఖవైపు స్పిరిట్ లోడుతో వెళుతున్న ట్యాంకర్ లారీని, అదే మార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న బొలేరో వ్యాన్ ఢీకొన్నది. దీంతో ట్యాంకర్ లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. బొలేరో వ్యాన్ హైవే పక్కన పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ గాయపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని పాడేరు ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఫిబ్రవరి 9: పాడేరు ఘాట్ మార్గంలోని వంట్ల మామిడి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జీపు, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అరకు నుంచి జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీ లక్కపాడు గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతున్న పాంగి ఈశ్వరరావు(35)ను చోడవరం నుంచి పాడేరుకు ప్రయాణికులతో వస్తున్న జీపు ఢీకొంది. దీంతో ఈశ్వరరావు కుడికాలు విరిగిపోయింది. ఆ సమయంలో అటుగా వచ్చిన టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలం క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి నుంచి 23 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 9: మండలంలో వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి పందివానిపాలెం గ్రామానికి చెందిన పి.పైడమ్మ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఎనిమిది బాటిళ్లు కొనుగోలు చేసి ఇంటి వద్ద అమ్మడానికి తీసుకువెళ్తుండగా ఎస్‌ఐ సురేశ్ శుక్రవారం రాత్రి అడ్డగించి పట్టుకున్నారు. అలాగే దలాయిపాలెం గ్రామానికి చెందిన దలాయి అప్పారావు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 15 క్వార్టర్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తుండగా ఎస్‌ఐ, పోలీసు సిబ్బందితో దాడి చేసి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠ చర్యలు

» జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.అనంతలక్ష్మి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.అనంతలక్ష్మి తెలిపారు. జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై జిల్లాస్థాయిలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐసీడీఎస్ పీవోలు, కమిటీ సభ్యులు నిఘా పెట్టి పోలీసు శాఖ సహకారంతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ రామవర్మ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయించిన వారికి, తోడ్పడిన వారికి న్యాయస్థానాలు విధించే శిక్షల గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సూర్యనారాయణ, బాలల సంక్షేమ జిల్లా అధికారి శరత్, మెడికల్ ఆఫీసర్ ఎస్తేరురాణి, బాలల పరిరక్షణ విభాగం అధికారి పి.లక్ష్మి, తదిరులు పాల్గొన్నారు.

'రక్షణ' లేని కల్వర్టులు


తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రక్షణ గోడ లేని కల్వర్టు

పరవాడ, ఫిబ్రవరి 9: మండల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. ముఖ్యంగా బీసీ బాలుర వసతిగృహం, మండల పరిషత్ కూడలి, జగనన్న కాలనీ సమీపంలో, లంకెలపాలెం మార్గంలో టింబర్ డిపో, తుక్కు దుకాణం ప్రాంతాల్లోని కల్వర్టులకు రక్షణ గోడలు లేవు. దీనివల్ల కల్వర్టుల వద్ద రాత్రి సమయంలో వాహనాలు ఎదురైనప్పుడు పక్కకు తప్పుకునే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతు న్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్వయంగా పరిశీలించి, కల్వర్టులకు వెంటనే రక్షణ గోడలు నిర్మించాలని, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

» అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ


ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది పరేడ్‌ను సమీక్షిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన కైలాసగిరి కొండ దిగువన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ మైదానంలో రిజర్వ్ పోలీసు సిబ్బంది పరేడ్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బు, మద్యం, గంజాయి అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ పి. నాగేశ్వరరావును ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రామకృష్ణారావు, వెంకట్రావు, అరవింద్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

బెంబేలెత్తిస్తున్న భూ రీసర్వే

తప్పుల తడకగా నమోదు

» అసలుకంటే తగ్గిపోతున్న భూ విస్తీర్ణం

» గగ్గోలు పెడుతున్న రైతులు

» పరిష్కారం చూపని రెవెన్యూ అధికారులు


యర్రా దుర్గాదేవి మీద పట్టాదారు పాస్ పుస్తకంలో 50 సెంట్లు ఉన్న దృశ్యం


రీ సర్వే తరువాత ఇచ్చిన పట్టాలో 48 సెంట్లు ఉన్న దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 9: జగన్న భూహక్కు-భూ రక్ష పథకం రైతుల పాలిట శాపంగా మారిందన్న విమర్శలు వినవస్తున్నాయి. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోని 357 రెవెన్యూ గ్రామాలకు గాను మొదటి విడత 50 గ్రామాల్లో, రెండో విడత 102 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. తాజాగా మూడో విడత 77 గ్రామాల్లో రీ సర్వే మొదలు పెట్టి 54 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో చాలా వరకు పట్టాలు కూడా పంపిణీ చేశారు. రీ సర్వే చేసేటప్పుడు విస్తీర్ణం తగ్గించి నమోదు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సర్వే సిబ్బందిని ప్రలోభపెడితే తమ భూమిని పక్క సర్వే నంబరులో కలిపేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ఆధారాలతో సహా రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లినా ప్రయోజనం ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. భూములు రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, అభ్యంతరాలను పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు పెద్దగా దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. చాలా చోట్ల రీ సర్వేలో పాతిన సరిహద్దు రాళ్లు రైతులు తీసి పారేస్తున్నారు.


సంబంగి శ్రీరాములు పేరుతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకంలో 2.35 ఎకరాలుగా నమోదై ఉన్న దృశ్యం

తగ్గిపోతున్న భూ విస్తీర్ణం

నర్సీపట్నం కాపువీధికి చెందిన యర్రా దుర్గాదేవికి నర్సీపట్నం మండలం గురొందరపాలెం సర్వే నంబరు 286/6లో పల్లం 33 సెంట్లు, 286/4లో మెట్టు 17 సెంట్లు భూమి ఉండేది. రీ సర్వే చేసిన తరువాత రెండు సెంట్లు తగ్గించి 48 సెంట్లుకు పట్టా ఇచ్చారు. భూమి కొలిస్తే 50 సెంట్లు సరిపోతుంది. రీ సర్వే తరువాత రికార్డుల్లో 48 సెంట్లు నమోదు చేశారు. మిగిలిన రెండు సెంట్లు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయమని అడుగుతుంటే చేయడం లేదు. అదే విధంగా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన సంబంగి శ్రీరాములుకి మాకవరపాలెం మండలం మల్లవరం గ్రామంలో సర్వే నంబరు 79/2లో ఎకరా పద్దెనిమిదిన్నర సెంట్లు, 79/3లో ఎకరా పదహారున్నర సెంట్లు .. మొత్తం 2.35 ఎకరాల భూమి ఉంది. రీ సర్వేలో 35 సెంట్లు తగ్గించి రెండు ఎకరాలుగా నమోదు చేశారు. మిగిలిన 35 సెంట్లు శ్రీరాములు భూమిని ఆనుకొని ఉన్న భూమిలో కలిపేసినట్టు ఉండడంతో జిల్లా కలెక్టర్‌కి, ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కరించడం లేదు. నర్సీపట్నానికి చెందిన కామిరెడ్డి సత్యనారాయణకు సంబంధించి గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో సర్వే నంబరు 63/1లో రెండు సెంట్లు, 94/3లో 17 సెంట్లు, 91 సర్వే నెంబరులో 78 సెంట్లు భూమి తగ్గిపోయిందని గగ్గోలు పెడుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

పీవీకి భారతరత్న తెలుగు వారికి గర్వకారణం

» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


పీవీ నరసింహారావుతో దాడి వీరభద్రరావు (ఫైల్)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం తెలుగు ప్రజలకు ఎంతో గర్వకారణమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, ఒకే ఏడాది ఐదుగురు ప్రముఖులను భారతరత్న పురస్కారాలకు ఎంపిక చేయడం చరిత్రాత్మకమని అన్నారు. వీరిలో పీవీ నరసింహారావు, ఎల్కే ఆడ్వాణీ, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌తో తనకు పరిచయం వుండడం సంతోషంగా వుందన్నారు. పీవీ నరసింహారావు తనను నాటక రచయితగా ప్రేమించేవారన్నారు.

అధ్యాపకుడిగా ఉన్నప్పటి నుంచి ఆయనతో సాహిత్య సంబంధాలు ఉండేవని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావుకు కూడా భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని ఆశిస్తున్నట్టు వీరభద్రరావు తెలిపారు.

పరిహారం ఇవ్వకుండా కారిడార్ పనులు ఎలా చేస్తారు?

» ఏపీఐఐసీ అధికారులను నిలదీసిన రైతులు

» గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయాలని టీడీపీ, సీపీఎం నేతలు డిమాండ్


కారిడార్ భూముల్లో నిరసన తెలుపుతున్న రైతులు, టీడీపీ, సీపీఎం నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 9: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) కోసం భూములిచ్చిన రైతులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయకుండా కారిడార్ పనులు ఎలా చేపడతారని రైతులు, టీడీపీ, సీపీఎం నేతలు ఏపీఐఐసీ అధికారులను నిలదీశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీసీఐసీలో బల్క్ డ్రగ్ యూనిట్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనే సమాచారం మేరకు పలు గ్రామాలకు చెందిన రైతులు చందనాడలో కారిడార్ భూముల వద్దకు చేరుకున్నారు. అక్కడ వున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథరావుకు, నిర్వాసిత రైతుల సమస్యలను టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు వివరించారు. డి.పట్టాదారులు, సాగుదారులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. అన్ని గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తెలుసుకోవాలని కోరారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మాట్లాడుతూ, కాగిత గ్రామంలో ఇళ్లు కోల్పోయే 795 కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని, గ్రామసభలు, ప్యాకేజీ అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజుపేట, అమలాపురం సర్పంచ్‌లు కాళ్ల శ్రీను, పెదహూడి శంకరరావు, నాయకులు ఎం.రాజేశ్, ఆర్.గోవిందరావు, జి.వెంకటరమణ, అప్పలరాజు, గంగరాజు, సత్తిబాబు, శివ, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో అప్పన్న విహారం

» వైభవంగా స్వామివారి తెప్పోత్సవం

» తరలివచ్చిన భక్త జనం


తెప్పోత్సవంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం, ఫిబ్రవరి 9 : వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఏటా పుష్యమాస బహుళపక్ష అమావాస్య నాడు స్వామివారు కొండదిగువ వరాహ పుష్కరిణిలో ఉభయ దేవేరులతో నౌకా విహారం చేయడం ఆనవాయితీ. ఈమేరకు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకారి కరి సీతారామాచార్యులు శిరస్సున నెమలి పింఛము, చేతిలో వేణువు ధరించిన భంగిమలో ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత గోవిందరాజస్వామిని పల్లకిలో ఉంచి మెట్ల మార్గంలో సాయంత్రం 5 గంటలకు కొండ దిగువకు తీసుకువచ్చారు. తొలిపావంచా వద్ద ఈఓ శ్రీనివాసమూర్తి పుష్పమాలిక, పండ్లు, కర్పూర నీరాజనాలిచ్చి ఉత్సవానికి ఆహ్వానం పలికారు. అనంతరం ఉత్సవం కోసం వరాహ పుష్కరిణికి చేరుకున్నారు. వైదికులు ప్రత్యేక పూజలు చేసిన తరువాత ఈఓ కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించగా పటిష్టమైన భద్రత నడుమ ఉత్సవమూర్తిని హంసాకృతి నౌకలో పుష్కరిణి మధ్య మండపం చుట్టూ ముమ్మారు తిప్పారు. అనంతరం వేణుగోపాలుడి మండపంలోకి తీసుకువెళ్లారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు, ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు ఆగమశాస్త్రోక్తంగా పుష్కరిణి ప్రధాన మండపంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తిరిగి నౌకలో స్వామివారిని పుష్కరిణి తీరానికి చేర్చి అక్కడి నుంచి పుష్కరిణి సత్రం ఆవరణలో ఉంచారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని కోనేరు వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం సర్వజన మనోరంజని వాహనంపై స్వామివారిని అధిష్ఠింపజేసి అడివివరం గ్రామ మూడు ప్రధాన మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. తిరువీధి మార్గం పొడవునా గ్రామస్థులు స్వామివారికి ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారు తిరిగి మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షణలో గోపాలపట్నం శాంతి భద్రతల సీఐ సురేష్ సారధ్యంలో 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా స్వామివారు తొలిపావంచాకు చేరుకున్న దగ్గర నుంచి తిరువీధి ముగిసే వరకు మార్గం పొడవునా ఆరు బృందాలు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

స్టీల్‌ప్లాంటును జాతికి అంకితం చేసింది పీవీనే


విశాఖ స్టీల్‌ప్లాంట్ విచ్చేసిన నాటి ప్రధానమంత్రి పీవీ.నరసింగరావు (ఫైల్)

విశాఖ స్టీల్‌ప్లాంటును 1992 ఆగస్టు ఒకటో తేదీన ప్రధాన మంత్రి హోదాలో పీవీ నరసింహరావే జాతికి అంకితం చేశారు. పీవీకి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం 'భారతరత్న' ప్రకటించిన నేపథ్యంలో నాటి జ్ఞాపకాలను ఉక్కు ఉద్యోగులు, కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు. పీవీకి అత్యున్నత పురస్కారం ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- స్టీల్‌ప్లాంటు

16న 'పారిశ్రామిక సమ్మె- గ్రామీణ బంద్'

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు


సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 16వ తేదీన 'పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ నిర్వహించనున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు చెప్పారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. కార్మికులకు సంబంధించి 40 చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ కంపెనీలకు మేలు చేకూర్చేలా, కార్మికులకు తీవ్ర నష్టం కలిగేలా కొత్తగా లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, నాయకులు కోన మోహన్, రాంబాబు, శంకరరావు, గాడి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ సారె ఊరేగింపు


అమ్మవారి సారెను ఊరేగిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని విజయరామరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారి ఆలయం 8వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు శుక్రవారం సారె ఊరేగింపు నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పిండివంటలు, మిఠాయిలు తయారు చేసి ఆలయానికి తీసుకువచ్చారు. సారెతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు ఆళ్ల శివరామ సత్యనారాయణ, బొబ్బిలి అప్పారావు, పలకా రాము, పిట్ల బుడ్డేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ సర్కార్ మోసం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ధ్వజం


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర సంవత్సరాల నుంచి అధికారంలో వుండి, డీఎస్సీ ఊసెత్తని జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మరోసారి మోసం చేస్తున్నదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ వుండగా కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేయడం, పైగా దీనిని మెగా డీఎస్సీ అంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా వుందన్నారు. డీఎస్సీ నియామకాలు జరిపి అప్రంటీస్ విధానం అమలు చేయడం మరీ ఘోరమని అన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల, ఏటా డీఎస్సీ నోటిఫికేషన్, ఖాళీగా వున్న 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని 2019 ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఎమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం, రాష్ట్రంలో ప్రైవేటు పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉద్యోగాలు రాక అనేకమంది చదువుకున్న యువతీ యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో పెట్టుబడుల విషయంలో ఏపీ ప్రథమ స్థానంలో వుండగా, జగన్‌రెడ్డి పాలనలో గంజాయి రవాణాలో అగ్రస్థానంలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ధనాల విష్ణుచౌదరి, బోడి వెంకటరావు పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారుడి సత్తా

» జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రమణమూర్తికి కాంస్య పతకం


జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన రమణమూర్తి

చోడవరం, ఫిబ్రవరి 9: జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణానికి చెందిన వెటరన్ క్రీడాకారుడు పి.వెంకట రమణమూర్తి కాంస్య పతకం సాధించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగు వందల మీటర్ల రిలే పరుగులో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పి.రమణమూర్తి మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

అనకాపల్లి నియోజకవర్గం

శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కింపు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 : దేమునిగుమ్మంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి హుండీ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. 43 రోజులకు రూ.రెండు లక్షల 18వేల 755ల ఆదాయం వచ్చింది. ఆలయ ఛైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవిందరావు, ఈవో టి.రాజసులోచనల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కశింకోట ఈవో కె.శ్రీనివాసరావు, ఆలయ పాలకవర్గ సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో అమావాస్య పూజలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 : ఇక్కడి నూకాంబిక బాలాలయంలో శుక్రవారం అమ్మవారికి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కాండ్రేగుల శ్యామల కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి రెండు జతల యూనిఫాంలను ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ అందజేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పీటీడీలో రక్తదాన శిబిరం



రక్తాన్ని దానం చేస్తున్న దాతలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 : రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఇక్కడి పీటీడీ డిపో వద్ద శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాతల నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ రక్తాన్ని సేకరించింది. సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ఇరవై మంది యువకులు, డిపో సిబ్బంది రక్తదానం చేశారు. డీఎం సుజాత, ఏడీఎం రవిచంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 : వారెంట్ జారీ చేయడానికి వెళ్లిన కోర్టు సిబ్బంది విధులకు ఆటంక పరిచిన వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ జి. శంకరరావు శుక్రవారం తెలిపారు. పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేడిశెట్టి అప్పలసత్యశ్రీనివాస్ గత నెల 26వ తేదీన పరమేశ్వరిపార్కు ప్రాంతంలో ఒక ఇంటికి వారెంటీ ఇవ్వడానికి వెళ్లారన్నారు. ఆ సమయంలో ఆళ్ల నాగేశ్వరరావు, మరికొంతమంది ఆయన విధులకు ఆటంక పరిచినట్టు శ్రీనివాస్ జిల్లా కోర్టుకు తెలియపరిచారన్నారు. దీంతో కోర్టు నుంచి గురువారం వచ్చిన సూచనల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వివరించారు.

శాంతియుత పోరుపై ఉక్కుపాదమా..?

- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆశ కార్యకర్తలు ఆగ్రహం
- డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని నినాదాలు


పరవాడలో డీటీకి వినతిని అందిస్తున్న దృశ్యం

కశింకోట, ఫిబ్రవరి 9 : ఆశ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తూ కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న ఆశ కార్యకర్తలు కశింకోట జాతీయ రహదారిపై శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, సీఐ టీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లా డుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించేందుకు వెళ్తున్న వారిని గృహ నిర్బంధాలు, అరెస్టులు చేయడం తగదన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పథ కాలు వర్తింపజేయాలని



కశింకోట జాతీయ రహదారిపై నిరసన తెలియజేస్తున్న ఆశ కార్యకర్తలు

డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం, కశింకోట పీహెచ్‌సీల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.నూకరత్నం, భార్గవి, రమణమ్మ, ఈశ్వ రమ్మ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఆశ వర్కర్లపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని వాపోయారు. జగన్ నియంతృత్వ పాలనకు పరాకాష్టగా మిగిలిపోతుందన్నారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వాజిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఆశ వర్కర్లు వెన్నెల లక్ష్మి, పరదేశమ్మ, వరలక్ష్మి, సన్యాసమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ

కశింకోట, ఫిబ్రవరి 9 : మండల కేంద్రం కశింకోటలో గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. ఇదిలావుంటే, శుక్రవారం సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపును నేత్రపర్వంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల తయారుచేసిన వివిధ రకాల పిండి వంటకాలను భారీ ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్‌కుమార్, వేగి దొరబాబు, వేగి వెంకట్రావు, ఆడారి నర్సింగరావు, పెంటకోట రాము, వేగి సాయి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు : సీఐ


ఉమ్మలాడ జంక్షన్‌ను పరిశీలిస్తున్న సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల అతివేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. ఇందులో భాగంగా సీఎంఆర్ సహకారంతో 40 స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. రద్దీ ఎక్కువ ఉన్న చోట, వాహనాలు వేగంగా వెళ్లే ప్రదేశాల్లో ఈ బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ సీహెచ్. నరసింగరావు, సిబ్బంది ఉన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 9 : ఇక్కడి శంకరంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాల ఆవరణలో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సచివాలయ సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా భద్రతా అంశాలతో పాటు రహదారి ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశరావు వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ పిళ్లా నరసింగరావు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం

... 3వ పేజీ తరువాయి

ఆరోపించారు. పన్నుల రూపంలో ప్రజలు కడుతున్న సొమ్ములో కొద్ది మొత్తాన్ని బటన్ నొక్కి తిరిగి ప్రజలకు ఇస్తూ.. వాళ్ల సొంత డబ్బులు ఇస్తున్నట్టు వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. మాడుగుల నియోజకవర్గంలో రోడ్లు ఇంత దారుణంగా ఉంటే ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఏం చేస్తున్నారని నాగబాబు ప్రశ్నించారు. ఓట్ల కోసం వైసీపీ నేతలు ఇళ్లకు వస్తే... కాలర్ పట్టుకుని ఐదేళ్లలో ఏం చేశారు? ఎందుకు ఓటెయ్యాలి? అని నిలదీయాలన్నారు. మాడుగుల ప్రాంతంలో అసంపూర్తిగా వున్న రిజర్వాయర్లు, యువతకు ఉపాధి లేకపోవడం, ప్రజలకు వైద్య సదుపాయం సరిగా లేకపోవడం, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పొత్తులో భాగంగా మాడుగుల నుంచి టీడీపీ లేదా జనసేన పార్టీల నుంచి ఎవరు పోటీ చేసినాసరే అభ్యర్థి గెలుపే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, గత ఐదేళ్లలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప వైసీపీ పాలకులు ప్రజలకు చేసిన మేలు అంటూ ఏమీ లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాయపురెడ్డి కృష్ణ, శ్రీరామ్, సురేఖ, శివాజీ, దాసరి అచ్యుతరావు, దయా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి అవశ్యం

చోడవరం, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల తరువాత రాష్ట్రంలో జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పడడం అవశ్యమని, దీనిని దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగబాబు మాట్లాడుతూ, టీడీపీతో పొత్తులో భాగంగా వచ్చే ఎన్నికల్లో చోడవరం నుంచి జనసేన పోటీ చేసే అవకాశం వుందని చెప్పారు. ఒకవేళ ఇక్కడ టీడీపీనే పోటీ చేయాల్సి వస్తే జనసేన శ్రేణులంగా టీడీపీ అభ్యర్థికి మద్దతుగా పనిచేయాలని కోరారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఈ ప్రాంతంలో చెరకు రైతుల సమస్యలతోపాటు, ఇతర సమస్యల పరిష్కారానికి పాటుపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నాయకులు సుందరపు విజయ్‌కుమార్, సుందరపు సతీశ్‌కుమార్, స్థానిక నేతలు సిరిపురపు రమేశ్, జెర్రిపోతుల నానాజీ, గూనూరు మూలినాయుడు, కర్రి రమేశ్, నందారపు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి నియోజకవర్గం

నేటి నుంచి శ్యామా నవరాత్రి ఉత్సవాలు



సబ్బవరం, ఫిబ్రవరి 9 : దేవీపురంలో శనివారం నుంచి శ్యామా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు గురుపత్ని అన్నపూర్ణ తెలిపారు. ఇందులో భాగంగా రాజ శ్యామలా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరుపుతామన్నారు. గోమాత పూజతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 14న వాగ్దేవి హోమం, 18న శ్యామా సిరిజ్యోతి పూజ, శ్యామా సహస్ర నామావళి అర్చన జరపనున్నామన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

పరవాడ, ఫిబ్రవరి 9 : ఆధునిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలని రీ సస్టెయినబిలిటీ సీహెచ్ఆర్‌వో డాక్టర్ సుజీవ్ నాయర్ సూచించారు. సంస్థ సీఎస్ఆర్ నిధులతో వాడచీపురుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రాంకీ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంవీ రామిరెడ్డి, కె.రవికుమార్, కె.శ్రీకాంత్, హెచ్ఎం కనకేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ నేత భూ దందా

... 3వ పేజీ తరువాయి

రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని అంటున్నారు. వైసీపీ నేత అక్రమంగా పొందిన స్థలం విలువ రూ.40 లక్షలు వుంటుందని చెబుతున్నారు. కాగా జగనన్న లే-అవుట్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించి, ప్లాట్లు ఏర్పాటు చేసుకున్నారు రెవెన్యూ అధికా రులు స్పందించి వైసీపీ నేత అక్రమంగా పొందిన 900 గజాల స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని, సాగులో వున్న దళితులకు అప్పగించాలని కోరుతున్నారు. లేదంటే స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు..

టీడీపీ సర్పంచ్‌పై కక్ష సాధింపు

... 3వ పేజీ తరువాయి

నిర్వహించకూడదని వైసీపీ ముఖ్యనేత భావించారు. అదనపు అంతస్తు పనులన్నీ పూర్తయినప్పటికీ దానికి ప్రారంభోత్సం చేయలేదు. పైగా ఊరు చివరన నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనంలోకి సచివాలయాన్ని తరలించారు. ఆర్‌బీకేతోపాటు వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, అమూల్ డెయిరీ భవనాలను గతనెల 29వ తేదీన ప్రారంభించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు.. అప్పటికే పనులు పూర్తయిన సచివాలయం భవనాన్ని (పంచాయతీ కార్యాయం పైన) మాత్రం ప్రారంభించలేదు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక సర్పంచ్‌ను అధికారులు ఆహ్వానించలేదు. కాగా స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడి కారణంగానే అధికారులు గ్రామ సచివాలయాన్ని ఆర్‌బీకేలోకి తరలించారని సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ భవనాల ప్రారంభోత్సవానికి సంబంధించి పంచాయతీ ప్రథమ పౌరుడినైన తనకు కూడా సమాచారం ఇవ్వలేదని వాపోయారు.

ఎలమంచిలి నియోజకవర్గం


అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల ప్రతినిధులు

ఎంఎస్ఎంఈతో జిందాల్ ఒప్పందం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 9: స్టెయిన్‌లెస్ స్టీల్ తయారీదారు జిందాల్ స్టెయిన్‌లెస్ సెజ్‌లోని ఎంఎస్ఎంఈతో శుక్రవారం ఒప్పందరు కుదుర్చుకుంది. క్షిపణి, ఉపగ్రహ ప్రయోగ వాహనాల విభాగాల కోసం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారు చేయడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. ఈ ఒప్పందం ద్వారా అధిక సామర్థ్యంతో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు అధిక నాణ్యత ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా జిందాల్ స్టెయిన్‌లెస్ మేనేజింగ్ డైరెక్టర్ అభ్యుదయ జిందాల్ అన్నారు. సాయుధ దళాల అవసరాలకు మెరుగైన సేవలకు, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ హెడ్ జి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జిందాల్ వంటి అగ్రగామి సంస్థలో కలిసి పనిచేయటానికి గర్వపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిందాల్ డిఫెన్స్ ఏరోస్పేస్ కల్నల్ పీయూష్ వర్మ, మార్కెటింగ్ హెడ్ అమిత్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పడవల పంపిణీ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 9: కొండకర్ల ఆవలో చేపలు పట్టే మత్స్యకారులకు శుక్రవారం పడవలు అందజేశారు. పట్టిన చేపలను మంచి ధరలకు విక్రయించడమే కాకుండా ఈ వృత్తిలో అదనపు ఆదాయం పొందేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా రీసస్టయిన్‌బిలిటీ సీహెచ్ఆర్‌వో డాక్టర్ సుజీవ్ నాయర్ చెప్పారు. రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఆవలో పట్టిన చేపలను శాస్త్రీయ పద్ధతిలో ఎండబెట్టి, వీటితో స్నాక్స్ తయారుచేసుకునేందుకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రవికుమార్, కె.శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేశ్వరి, శివారెడ్డి, రమణ పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న అవార్డుపై హర్షం

ఎలమంచిలి, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించడం హర్షణీయమని ఎలమంచిలి గాయత్రీ సేవా ట్రస్ట్ ఛైర్మన్ సిహెచ్.సోమేశ్వరావు, కార్యదర్శి పి.సూర్యనారాయణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పీవీ అమలు చేసిన సంస్కరణలు మరువలేనివని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

జనసేనలోకి వైసీపీ శ్రేణులు

రాంబిల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని వెల్బూరు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు ఎస్.రాంబాబుతో పాటు మరో 30 మంది కార్యకర్తలు గురువారం రాత్రి అచ్యుతాపురంలోని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ నివాసంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణెదల నాగబాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరిని నాగబాబు కండువావేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుందపు సతీష్‌కుమార్, పంచకర్ల రమేష్‌బాబు, పప్పల నూకన్నదొర, లాలం చందు, జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసైనికులు ఉన్నారు.

టీబీతో 51 శాతం మరణాలు

మునగపాక, ఫిబ్రవరి 9: టీబీ కారణంగా భారతదేశంలో 51 శాతం మరణాలు సంభవిస్తున్నాయని జిల్లా టీబీ నివారణ అధికారి ఎంఎస్‌వీకే బాలాజీ చెప్పారు. వీహెచ్‌సీలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీని అరికట్టడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.విమలగిరి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి, సూపర్‌వైజర్లు ఎం.రామకృష్ణ, ఎ.యల్లాజీ, సీహెచ్‌వో దేవకాంత పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత


చేనేత కార్మికులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే అనిత

పాయకరావుపేట, ఫిబ్రవరి 9: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. శుక్రవారం జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సబ్సిడీ రుణాలు, ఇతర పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన నేత కార్మికులకు ఎటువంటి సాయం అందకపోగా, పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీంతో అనిత స్పందిస్తూ టీడీపీ హయాంలోనే చేనేత కార్మికులను అన్ని విధాలా ఆదుకున్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వార్డు సభ్యులు ఎం.వెంకటరమణ, దాసరి శ్రీనివాసరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా రహదారి భద్రతా వారోత్సవాలు




కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఎలమంచిలి/కోటవురట్ల/మునగపాక, ఫిబ్రవరి 9: రహదారి భద్రతా వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి, కోటవురట్ల, మునగపాక మండలాల్లో ర్యాలీలు, మానవహారాలు చేశారు. ఎలమంచిలి మై హోమ్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) విహెచ్.చౌదరి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించే బాధ్యత అందరిపై నా ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. కార్యక్రమంలో జీఎం (ఆపరేషన్సు) బి.రామస్వామి, సీనియర్ డీజీఎం (పిఅండ్ఏ) ఎల్.శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజరు (సేఫ్టీ) కె.సతీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మునగపాక మండల సమాఖ్య ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌పై మహిళలు మానవహారం నిర్వహించారు. మునగపాక మండల కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీగా మెయిన్‌రోడ్‌కు చేరుకున్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడపరాదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తహశీల్దార్ పాపారావు, వెలుగు ఏపీఎం కొండమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు ఎ.అచ్చయ్యనాయుడు, ఏఎస్ఐ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల కూడలిలో కూడా డ్వాక్రా మహిళలు మానవహారం చేపట్టారు. అక్కడిక వరకు నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చారు. వెలుగు ఏపీఎం కురుణానిధి, సీసీలు వల్లి, సరోజని, అప్పలకొండ, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా నులి పురుగుల నివారణ దినోత్సవం


ఎలమంచిలిలోని పురుషోత్తపురం విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో అప్పలనాయుడు

ఎలమంచిలి/పాయకరావుపేట/ఎస్.రాయవరం/నక్కపల్లి/రాంబిల్లి, ఫిబ్రవరి 9: జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎలమంచిలి పురుషోత్తపురం హైస్కూలు విద్యార్థులతో ఎంపీడీలో అప్పలనాయుడు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎం.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాయకరావుపేట మండలంలో 97.21 శాతం ఈ మాత్రం పంపిణీని పూర్తి చేసినట్టు వైద్యాధికారి సుభాష్ తెలిపారు. రాంబిల్లి మండలంలోని రాంబిల్లి, దిమిలి పిహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది నులి పురుగుల నిర్మూలనా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. రాంబిల్లి హైస్కూల్లో ఎంపీపీ జి.శిరీషా విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. రాంబిల్లి పీహెచ్‌సీ పరిధిలో 4057 మంది విద్యార్థులకు మాత్రలు ఇచ్చామని వైద్యాధికారిణి సిహెచ్.దీపిక తెలిపారు. దిమిలి పీహెచ్‌సీ 4,315 మంది విద్యార్థులతో మాత్రలు మింగించామని వైద్యాధికారి ఆర్.వెంకటేష్ తెలిపారు. ఈ నక్కపల్లి మండలంలోని పెదబోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ షేక్ మున్నీషా బేగం పిల్లలకు నులిపురుగుల నివారణకు అవసరమైన అల్బెండోజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ ఖాశీషా, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఎస్.రాయవరంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రవేట్ విద్యాలయాల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు డాక్టర్ ఎన్.వాసంతి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఫిషర్‌మెన్ కో- ఆర్డినేటర్‌గా గోవింద్

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన ఉమ్మిడి గోవింద్ కాంగ్రెస్ రాష్ట్ర ఫిషర్‌మెన్ కోఆర్డినేటర్‌గా నియామకమయ్యారు. ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. ఇప్పుడు ఫిషర్‌మెన్ కో-ఆర్డినేటర్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని, జిల్లాలో కాంగ్రెస్ మరింత బలోపేతమయ్యేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా గోవింద్ తెలిపారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పెదగుమ్ములూరు, సీతారామపురం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో డీటీ శ్యామ్ ఈవీఎం పరికరాల వినియోగం గురించి ప్రయోగాత్మకంగా వివరించారు.

పేట' వైసీపీ టిక్కెట్‌కు బంగారయ్య దరఖాస్తు

పాయకరావుపేట: అసెంబ్లీ ఎన్నికల్లో పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని శుక్రవారం ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ.సబ్బారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్టు వైసీపీ నేత డాక్టర్ బి.బంగారయ్య తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందిస్తూ ప్రజాభిమానం పొందిన తనకు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు ఆయన చెప్పారు.

ఆశ కార్యకర్తల ఆందోళన

కోటవురట్ల/రాంబిల్లి: సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆశ కార్యకర్తలు కోటవురట్ల, రాంబిల్లి మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. పని భద్రత కల్పించాలని, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, పలు డిమాండ్‌లు నెరవేర్చాలని వారు నినాదాలు చేశారు. తమ ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా అత్యంత దుర్మార్గంగా పోలీసులు రోడ్లపైన ఈడ్చి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఉద్యమాలను ప్రభుత్వం ఆపడం సరికాదని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు, ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధి ఎం.సత్యవతి పాల్గొన్నారు.

కలగానే కేఎం ఛానెల్‌కు నీరు

... 3వ పేజీ తరువాయి

ఎన్నికల ప్రచారంలో భాగంగా రావికమతం మండలంలో పర్యటించిన కరణం ధర్మశ్రీ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నెల రోజుల్లోనే పెద్దేరు కుడి ప్రధాన కాలువకు చినపాచిల కరెడ్ల వారి కల్లాల వద్ద తూము ఏర్పాటు చేసి, కేఎం ఛానెల్‌కు సాగునీరు అందిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.. రెండేళ్ల క్రితం ప్రభుత్వ విప్ పదవి కూడా వచ్చింది. కానీ పెద్దేరు కాలువకు తూము ఏర్పాటు చేయించలేదు.. కేఎం ఛానెల్‌కు నీరు పారలేదు. ఐదేళ్లయినా హామీ అమలుకాకపోవడంతో ఈ నెల 2వ తేదీన కొమిర గ్రామంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన కరణం ధర్మశ్రీని రైతులు నిలదీశారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని పదే పదే చెప్పుకుంటున్న మీరు... ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారని ధర్మశ్రీని ప్రశ్నించారు.

పాయకరావుపేట నియోజకవర్గం


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో జయరామ్

సరిహద్దు రాళ్లు శరవేగంగా పాతండి: ఆర్డీవో

కోటవురట్ల, ఫిబ్రవరి 9: రీ సర్వే పూర్తిచేసిన భూముల్లో సరిహద్దు రాళ్లను శరవేగంగా పాతాలని నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ పాములవాకలో సర్వే తొందరగా పూర్తిచేయాలన్నారు. అలాగే ఇళ్లకు ఓటీఎస్ కూడా వేగవంతంగా చేయాలన్నారు. సర్వే నంబర్ల తేడాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 9: కాకినాడ జిల్లా తునిలో శుక్రవారం నిర్వహించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక నేతలు తరలివెళ్లారు. పార్టీ కార్యాలయానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు వచ్చి పార్టీ జెండాలతో ర్యాలీగా వెళ్లారు. పార్టీ నేత నారాయణచక్రవర్తి పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో అక్రమాలు'

నక్కపల్లి, ఫిబ్రవరి 9: వైసీపీ పాలనలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల నేత కొయ్య ప్రసాద్‌రెడ్డి ఆరోపించారు వైఎస్ఆర్ తరువాత పాలన, అభివృద్ధి కుంటుపడ్డాయన్నారు. మరలా షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పుంజుకుంటుందని చెప్పారు. హేచరీలను అధికార పార్టీ నేతలను దోచుకుంటున్నారని ఆరోపించారు. అతన్ని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గోవిందరావు, నాయకులు మారుతి చక్రవర్తి, ప్రగడ చక్రరావు, నాగ చిరంజీవి, బత్తుల రఘు, నీలి అశోక్, శ్రీధర్, రాజశేఖర్, సత్యనారాయణ సత్కరించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీల సభ

నక్కపల్లి, ఫిబ్రవరి 9: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలకు సంబంధించి శుక్రవారం బహిరంగ సభ జరిగింది. ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, అదనపు పీడీ రోజా రమణి, తనిఖీల అధికారి నిర్మలాదేవి, అంబుడ్స్‌మన్ చిన్నయ్యదొర తనిఖీల నివేదికలు వివరించారు. చందనాడలో జరిగిన రూ1.71 లక్షల పనులకు సంబంధించి రూ.15,500 నిధులు రాబట్టాలని నిర్ణయించారు. ఎంపీపీ రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి కల్యాణం

పాయకరావుపేట రూరల్: రాజగోపాలపురం గ్రామంలో కోదండరామస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణం తిలకించారు.ఆలయం ఛైర్మన్ రావాడ నాగిరెడ్డి, సర్పంచ్ లోవరెడ్డి, గురుస్వామి సూరిబాబు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలలో బందోబస్తు

పెంటకోట మెరైన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తీర ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు మెరైన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ ఎమ్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్లకు అడ్డాగా దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం

- మండల సమావేశంలో అధికార వైసీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం
- పనులు జరగకపోతుండడంతో ప్రజల్లో తలెత్తుకోలేకపోతున్నామని మరికొందరు ఆవేదన
- ఆద్యంతం ప్రశ్నల పరంపర సాగడంతో అధికారులు అవాక్కు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి, ఫిబ్రవరి 9 : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం బ్రోకర్లకు తప్ప సామాన్య ప్రజానీకానికి పనిచేసే విధంగా లేదని పలువురు అధికార పార్టీ వైసీపీకి చెందిన సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యల పరిష్కారానికి తొంబై రోజులు పరిపడవా అంటూ.. బి.కింతాడ, ఎ.కొత్తపల్లి సర్పంచ్‌లు బూరే బాబూరావు, చింతల వెంకటరమణతో పాటు పలువురు సభ్యులు ప్రశ్నించారు. దేవరాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఇక్కడ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ మాట్లాడుతుండగా పలువురు సభ్యులు లేచారు. రీసర్వేలో చాలా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రైతులకు తెలియకుండానే నచ్చినట్లు రాళ్లు పాతుకుని వెళ్లిపోతున్నారని నిప్పులు చెరిగారు. ఇందులో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఎక్కువైందన్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అధికారుల పనితీరు సక్రమంగా లేకపోవడం వలన గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామని బి.కింతాడ సర్పంచ్ బాబూరావు, వెంకటరాజపురం సర్పంచ్ సంతోశ్ అన్నారు. ఐసీడీఎస్ పీవో మంగతాయారు మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆమె అనడంతో ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల వెంకటరమణ లేచి తొమ్మిది నెలల క్రితం అంగన్‌వాడీ భవనం గురించి చెప్పినా పట్టించుకోలేదన్నారు. పాఠశాలలో తరగతి గదులు ఖాళీగా ఉన్నాయని చెప్పినా అద్దె భవనంలో గడపడం ఏమిటని ప్రశ్నించారు. సంపద కేంద్రం గురించి చెప్పినా ఏపీవో పట్టించుకోలేదని ఆ సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీపురంలో సంపద కేంద్రం అసంపూర్తిగా ఉండిపోయిందని టీడీపీకి చెందిన సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి అన్నారు. ఈ సమస్య చెప్పడం ఇది మూడో సమావేశంగా పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు ఇటువంటి సమావేశాలు ఎందుకని కొత్తపల్లి సర్పంచ్ వెంకటరమణ ప్రశ్నించారు. ఎంపీడీవో సుబ్బలక్ష్మి స్పందిస్తూ శనివారం ఆ గ్రామం వచ్చి సమస్య పరిష్కరిస్తామని బదులిచ్చారు. అలమండలో చెరువులు లేవని, రైవాడ నీరు ఆయకట్టుకు విడుదల చేసినప్పుడు సక్రమంగా రావడం లేదని ఎంపీటీసీ పోతల వెంకటరావు అన్నారు. కాలువలు తవ్వాలని ఏపీవోను కోరారు. అలాగే తిమిరాం గ్రామంలోని చెరువుల్లో ఉపాధి పనులు చేపట్టాలని సర్పంచ్ సూర్యనారాయణ కోరారు. ఏపీవో చంద్రకళ స్పందించి సర్వే చేసి చెరువులు ఇస్తే పనులు తప్పకుండా చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



పతాకావిష్కరణ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 9 : పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్ సమీపంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ పోరాటాల ఫలితంగా ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కారమైనట్టు చెప్పారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వంటి అనేక విజయాలు సాధించామన్నారు. సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం

... 3వ పేజీ తరువాయి

ఆరోపించారు. పన్నుల రూపంలో ప్రజలు కడుతున్న సొమ్ములో కొద్ది మొత్తాన్ని బటన్ నొక్కి తిరిగి ప్రజలకు ఇస్తూ.. వాళ్ల సొంత డబ్బులు ఇస్తున్నట్టు వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. మాడుగుల నియోజకవర్గంలో రోడ్లు ఇంత దారుణంగా ఉంటే ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఏం చేస్తున్నారని నాగబాబు ప్రశ్నించారు. ఓట్ల కోసం వైసీపీ నేతలు ఇళ్లకు వస్తే... కాలర్ పట్టుకుని ఐదేళ్లలో ఏం చేశారు? ఎందుకు ఓటెయ్యాలి? అని నిలదీయాలన్నారు. మాడుగుల ప్రాంతంలో అసంపూర్తిగా వున్న రిజర్వాయర్లు, యువతకు ఉపాధి లేకపోవడం, ప్రజలకు వైద్య సదుపాయం సరిగా లేకపోవడం, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ సమస్యల పరి ష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పొత్తులో భాగంగా మాడుగుల నుంచి టీడీపీ లేదా జనసేన పార్టీల నుంచి ఎవరు పోటీ చేసినాసరే అభ్యర్థి గెలుపే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, గత ఐదేళ్లలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప వైసీపీ పాలకులు ప్రజలకు చేసిన మేలు అంటూ ఏమీ లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాయపురెడ్డి కృష్ణ, శ్రీరామ్, సురేఖ, శివాజీ, దాసరి అచ్యుతరావు, దయా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి అవశ్యం

చోడవరం, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల తరువాత రాష్ట్రంలో జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పడడం అవశ్యమని, దీనిని దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగబాబు మాట్లాడుతూ, టీడీపీతో పొత్తులో భాగంగా వచ్చే ఎన్నికల్లో చోడవరం నుంచి జనసేన పోటీ చేసే అవకాశం వుందని చెప్పారు. ఒకవేళ ఇక్కడ టీడీపీనే పోటీ చేయాల్సి వస్తే జనసేన శ్రేణులంగా టీడీపీ అభ్యర్థికి మద్దతుగా పనిచేయాలని కోరారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఈ ప్రాంతంలో చెరకు రైతుల సమస్యలతోపాటు, ఇతర సమస్యల పరిష్కారానికి పాటుపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నాయకులు సుందరపు విజయ్‌కుమార్, సుందరపు సతీశ్‌కుమార్, స్థానిక నేతలు సిరిపురపు రమేశ్, జెర్రిపోతుల నానాజీ, గూనూరు మూలినాయుడు, కర్రి రమేశ్, నందారపు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



చీడికాడలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు



చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో...



బుచ్చెయ్యపేటలో పీహెచ్‌సీ ఎదుట...

శాంతియుత పోరుపై సర్కారు కర్కశమా..?

- 'చలో విజయవాడ' భగ్నంపై ఆశ కార్యకర్తలు ఆగ్రహం
- గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులపై ముక్తకంఠంతో ఖండన
- మండల కేంద్రాల్లో ఆందోళనలు
- పోలీసుల దుశ్చర్యలపై నినాదాలు



రావికమతంలో...



రోలుగుంటలో...



దేవరాపల్లిలోని నాలుగు రోడ్లు కూడలిలిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు



కె.కోటపాడులో...



గొలుగొండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట...

చోడవరం, ఫిబ్రవరి 9 : సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలపై పోలీసుల జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ శుక్రవారం చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో ఆశ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించి వారిపై లాఠీలు ఝుళిపించడం తగదని, ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో స్థానిక ఆశ కార్యకర్తల సంఘం నాయకులు బొడ్డాన రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : 'చలో విజయవాడ'ను భగ్నం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం వేసిన ఎత్తులను నిరసిస్తూ శుక్రవారం బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ ఎదుట ఆశ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం మండల నాయకురాళ్లు శనివాడ లక్ష్మి, టేకు అంబిక, వి.లక్ష్మి తదితరులు మాట్లాడుతూ చలో విజయవాడకు ముందు రోజు సాయంత్రం నుంచి ఆశ కార్యకర్తలను గృహ నిర్బంధం చేయడం, రైళ్లలో, బస్సుల్లో వెళుతున్న వారిని అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. రాష్ట్రంలో వైసీపీ నియంతృత్వ పాలన సాగిస్తుందని మండిపడ్డారు. ప్రశ్నించే వారి గొంతు నులిపి, పోలీస్ నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ప్రభుత్వం పతనం తప్పదని వారంతా హెచ్చరించారు.

గొలుగొండ : ఆశ కార్యకర్తలు శుక్రవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు కాపారపు మేరీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పైగా విజయవాడలో చేపట్టే ఆందోళనకు వెళుతున్న వారిని పోలీసులు అడ్డుకోవడం, కొందరిని గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఆశ కార్యకర్తలంతా హాజరయ్యారు.

దేవరాపల్లి : ఆశ కార్యకర్తలపై పోలీసులు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం ఇక్కడ వారంతా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న, సీఐటీయూ మండల నాయకుడు బి.టి.దొర మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు విజయవాడ వెళుతున్న వారిపై లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నిరంకుశ పాలనకు ఇదో నిదర్శనమన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం నాయకులు పార్వతి, కమల, వరలక్ష్మి, రమణమ్మ, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఆశ కార్యకర్తల అక్రమ అరెస్టుకు నిరసనగా శుక్రవారం ఇక్కడి మూడురోడ్ల జంక్షన్‌లో ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గట్ట నాగమణి, ఎన్.భానుకుమారి, ఎస్.అరుణ, ఆర్.రామలక్ష్మి, జి.దేవుడమ్మ, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి నాయనబాబు, వి.సూర్యనారాయణ, మండల ప్రజాసంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆశ కార్యకర్తలు ఇక్కడ ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. సమస్యల సాధనకు విజయవాడకు వెళ్లేందుకు యత్నిస్తుండగా ఆశ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఆశ వర్కర్లు ఇందిరా, లోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఆశ కార్యకర్తలు బహిష్కరించారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం పెంచడంతో పాటు వివిధ డిమాండ్ల సాధనకు విజయవాడ ధర్నాకు వెళ్తున్న ఆశ కార్యకర్తలను గృహ నిర్బంధం చేయడంతో, మార్గమధ్యలో దించేసి ఇబ్బందులకు గురిచేయడం తదితరాలను నిరసనగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీతో పాటు శుక్రవారం విధులను బహిష్కరించామని సంఘ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడ ఆశ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, కె.ఆదిలక్ష్మి, కార్యదర్శి బూరుగు నూకరత్నం, గౌరవాధ్యక్షురాలు గల్లా పార్వతి, జంపా జగ్గమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జి చేయడం తగదని మండలంలోని ఆశ కార్యకర్తలు వాపోయారు. శుక్రవారం చీడికాడలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలపై లాఠీచార్జి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పాలన : విప్ ధర్మశ్రీ



చోడవరంలో నమూనా చెక్కు అందిస్తున్న ధర్మశ్రీ

చోడవరం/బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 9 : మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం ఇక్కడి శివాలయం ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా నమూనా చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, వెలుగు ఏపీఎం నాయుడు, డీసీఎంఎస్ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు పల్లా నరసింగరావు, ఏడువాక సత్యారావు, వైసీపీ మండల అధ్యక్షుడు డీవీఆర్, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి జడ్పీ హైస్కూల్ మైదానంలో డ్వాక్రా సంఘాల మహిళలకు కూడా ధర్మశ్రీ నమూనా చెక్కులను అందజేశారు. ఎంపీపీ దొకవరపు నాగేశ్వరి దేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు గొంపా వెంకటేశ్వరరావు, దొండా లలిత, వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచ్‌లు పెదిరెడ్ల మాణిక్యంలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో టీడీపీ విజయమే అందరి లక్ష్యం కావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అద్దెపల్లి జగ్గారావు

మాడుగుల, ఫిబ్రవరి 9 : టీడీపీ శ్రేణులు మండలంలోని గ్రామ గ్రామాన పర్యటించి పార్టీ అధికారంలో వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా వివరించాలని మండల శాఖ అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు సూచించారు. శుక్రవారం ఇక్కడ పార్టీ మండలస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున నాయకులు, కార్యకర్తలు అంతా ఇప్పటి నుంచే సైనికుల్లా పనిచేయాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందన్న విషయాన్ని ప్రజలందరికీ వివరించాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, మండల ఉపాధ్యక్షుడు బుద్దాల రమణ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, గంగమ్మ, కృష్ణ, వడ్డే రాజ్‌కుమార్, కాశిబాబు, సూర్యనారాయణ రాజు, మరువాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యకలాపాలు మరింత విస్తృతం

కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు

చోడవరం, ఫిబ్రవరి 9 : ఇక్కడి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యకలాపాలు మరింత విస్తృతం చేయనున్నట్టు కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు తెలిపారు. శుక్రవారం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వడ్డాదిలో ఉన్న మార్కెట్ కమిటీ స్థలంలో వ్యాపారాభివృద్ధికి తోడ్పడే ప్రతిపాదనలతో పాటు, ఇతర పనులకు సంబంధించిన అంశాలపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లినట్టు చెప్పారు. రైతులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు సైతం అంచనాలు రూపొందించి పంపించామన్నారు. జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి బి.రవికిరణ్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా ఆదాయం పెంచుకునే మార్గాలపై దృష్టి సారించడంతో పాటు, రైతులకు మార్కెటింగ్ సేవలు అందేలా చూడాలని కోరారు. అనంతరం పదోన్నతిపై కొత్తవలస మార్కెట్ కమిటీ గ్రేడ్ త్రీ కార్యదర్శిగా పదోన్నతిపై వెళుతున్న కుసుమ విజయ్‌బాబును ఛైర్మన్‌తో పాటు, కమిటీ సభ్యులు సత్కరించారు. కమిటీ కార్యదర్శి ఎస్.బంగార్రాజు, సూపర్‌వైజర్ పి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై గ్రామాల్లో ప్రచారం

మాకవరపాలెం, ఫిబ్రవరి 9 : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాకవరపాలెం, జి.వెంకటాపురం, జి.కోడూరు, సుభద్రయ్యపాలెం, పోతలూరు, అప్పన్నదొరపాలెం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్రి నాయుడు, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, అంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

రావికమతం, ఫిబ్రవరి 9 : మరుపాక ఆదర్శ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరైనట్టు ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ శుక్రవారం తెలిపారు. ఈ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు ముప్పై మంది పరీక్షకు హాజరు కాగా, ఎనిమిది మంది ఎంపికైనట్టు చెప్పారు.

నేటి నుంచి టీడీపీ నాయకులు పాదయాత్ర

చీడికాడ, ఫిబ్రవరి 9 : టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నుంచి సోమవారం వరకు మండలంలోని పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు తెలిపారు. అప్పలరాజుపురంలో తొలుత పాదయాత్ర ప్రారంభం కానుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ తదితరులు హాజరు కానున్నారన్నారు.

నేడు మాకవరపాలెం మండల సమావేశం

మాకవరపాలెం, ఫిబ్రవరి 9 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో చేపట్టిన పనులపై చర్చించడం జరుగుతుందన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఈవీఎంలపై అవగాహన సదస్సు

రావికమతం, ఫిబ్రవరి 9 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దొండపూడి, కిత్తంపేటలలో రెవెన్యూ అధికారులు శుక్రవారం మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఆర్ఐ సతీష్ ఓటు వేసే విధానంపై ముందుగా అవగాహన కల్పించారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన

నాతవరం, ఫిబ్రవరి 9 : బిందు సేద్యం ద్వారా రైతులు ప్రయోజనం పొందవచ్చునని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ లక్ష్మి అన్నారు. నాతవరం, మర్రిపాలెంలలో ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు శుక్రవారం ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో మాట్లాడారు. ఏటీఎంఏ పీడీ ఎం.ఆశాదేవి, పతంజలి కంపెనీ ప్రతినిధి టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'పక్కా వివరాలతో కులగణన'

నాతవరం, ఫిబ్రవరి 9 : కులగణన సర్వేలో తప్పులు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జె.రాంబాబు సూచించారు. నాతవరంలో సర్వే జరుగుతున్న తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. కులగణన సర్వే చేసేటప్పుడు వారి కులం, ఏ రకపు ఇల్లు, పశువులు తదితర వివరాలు పక్కాగా సేకరించాలన్నారు.

నాలుగు కిలో గంజాయితో ఐదుగురు అరెస్టు

కె. కోటపాడు, ఫిబ్రవరి 9 : మండల కేంద్రం కె.కోటపాడులో శుక్రవారం రెండు బైక్‌లపై తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ జి.లక్ష్మీనారాయణ తెలిపారు. అల్లూరి జిల్లా హుకుంపేట మండలం వాకపల్లి గ్రామానికి చెందిన వి.రమేష్, వి.రాంబాబు, జి.చంటిబాబు, పెందుర్తికి చెందిన పి.ఆనందకుమార్, విశాఖపట్నంలోని 104 ఏరియాకు చెందిన వి.రాజకుమార్‌లు విశాఖపట్నం రెండు బైక్‌లపై వెళుతుండగా అనుమానం వచ్చి తనిఖీలు చేశామన్నారు. ఈ సందర్భంగా వీరి వద్ద గంజాయి లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

జూనియర్ కళాశాలగా హైస్కూల్ అప్‌గ్రేడ్

నాతవరం, ఫిబ్రవరి 9 : మండల కేంద్రం నాతవరంలో గల హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలోని నర్సీపట్నం, మాకవరపాలెం గొలుగొండ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నప్పటికీ నాతవరం మండలంలో లేదు. దీంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లి చదువులు సాగిస్తున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో కొందరు పేద విద్యార్థులు చదువుకు కూడా దూరమయ్యారు. ఈ సమస్యపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయం తీసుకుంది.

వైసీపీ నేత భూ దందా

... 3వ పేజీ తరువాయి

రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని అంటున్నారు. వైసీపీ నేత అక్రమంగా పొందిన స్థలం విలువ రూ.40 లక్షలు వుంటుందని చెబుతున్నారు. కాగా జగనన్న లే-అవుట్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించి, ప్లాట్లు ఏర్పాటు చేసుకున్నారు రెవెన్యూ అధికారులు స్పందించి వైసీపీ నేత అక్రమంగా పొందిన 900 గజాల స్థలాన్ని తిరిగిస్వాధీనం చేసుకోవాలని, సాగులో వున్న దళితులకు అప్పగించాలని కోరుతున్నారు. లేదంటే స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు..

టీడీపీ సర్పంచ్‌పై కక్ష సాధింపు

... 3వ పేజీ తరువాయి

నిర్వహించకూడదని వైసీపీ ముఖ్యనేత భావించారు. అదనపు అంతస్థు పనులన్నీ పూర్తయినప్పటికీ దానికి ప్రారంభోత్సం చేయలేదు. పైగా ఊరు చివరన నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనంలోకి సచివాలయాన్ని తరలించారు. ఆర్‌బీకేతోపాటు వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, అమూల్ డెయిరీ భవనాలను గత నెల 29వ తేదీన ప్రారంభించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు.. అప్పటికే పనులు పూర్తయిన సచివాలయం భవనాన్ని (పంచాయతీ కార్యాలయం పైన) మాత్రం ప్రారంభించలేదు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక సర్పంచ్‌ను అధికారులు ఆహ్వానించలేదు. కాగా స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడి కారణంగానే అధికారులు గ్రామ సచివాలయాన్ని ఆర్‌బీకేలోకి తరలిం చారని సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ భవనాల ప్రారంభోత్సవానికి సంబంధించి పంచాయతీ ప్రథమ పౌరుడినైన తనకు కూడా సమాచారం ఇవ్వలేదని వాపోయారు.

కలగానే కేఎం ఛానెల్‌కు నీరు

... 3వ పేజీ తరువాయి

ఎన్నికల ప్రచారంలో భాగంగా రావికమతం మండలంలో పర్యటించిన కరణం ధర్మశ్రీ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నెల రోజుల్లోనే పెద్దేరు కుడి ప్రధాన కాలువకు చినపాచిల కరెడ్ల వారి కల్లాల వద్ద తూము ఏర్పాటు చేసి, కేఎం ఛానెల్‌కు సాగునీరు అందిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.. రెండేళ్ల క్రితం ప్రభుత్వ విప్ పదవి కూడా వచ్చింది. కానీ పెద్దేరు కాలువకు తూము ఏర్పాటు చేయించలేదు.. కేఎం ఛానెల్‌కు నీరు పారలేదు. ఐదేళ్లయినా హామీ అమలుకాకపోవడంతో ఈ నెల 2వ తేదీన కొమిర గ్రామంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన కరణం ధర్మశ్రీని రైతులు నిలదీశారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని పదే పదే చెప్పుకుంటున్న మీరు... ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారని ధర్మశ్రీని ప్రశ్నించారు.

ధర్మశ్రీ మాటలు నమ్మి మోసపోయాం



గొర్లె సన్యాసినాయుడు, రైతు, కొమిర



సాసుబిల్లి రమణ, రైతు, చినపాచిల

ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాటలు నమ్మి మోసపోయాం. తనను గెలిపిస్తే నెల రోజుల్లో పెద్దేరు కుడి కాలువకు కరెడ్ల వారి కల్లాల వద్ద తూము ఏర్పాటు చేయించి కేఎం ఛానెల్‌కు నీరు అందిస్తానని గత ఎన్నికల ముందు చెప్పారు. పెద్దేరు ప్రాజెక్టు అధికారులను ఇక్కడకు తీసుకువచ్చి పనులు చేయిస్తానని అన్నారు. నిజమేనని నమ్మాం. తీరా గెలిచాక మాట నిలబెట్టుకోలేదు. తూము ఏర్పాటుకు మూడు లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు అవుతాయి. ఐదేళ్ల నుంచి ఆ మాత్రం పని కూడా చేయించలేకపోయారు.